ప్రజాశక్తి

శనివారం 3 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బయటపడని గుట్టు

- వసంత్ కెమికల్స్‌పై విచారణ తాత్సారం
- దాటిన గడువు
- పూర్తికాని నివేదిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో పరిశ్రమల ప్రమాదాలను ప్రభుత్వ యంత్రాంగం తేలికగా తీసుకుంటోంది. పరిశ్రమల్లో కార్మికులు చనిపోతున్నా, గాయాలపాలై ఆస్పత్రుల పాలవుతున్నా ప్రమాద నియంత్రణ చర్యలు పటిష్టంగా అమలుజరిగేలా చూడ్డంలేదు. ప్రమాద సమయాల్లో భద్రతలో డొల్లతనం బయటపడుతోంది. ప్రమాదం ఏ పరిశ్రమల్లో, ఏ స్థాయిలో జరిగినా యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోని కారణంగా జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యమే. అయినా సరిదిద్దే చర్యలు ప్రభుత్వమూ తీసుకోవడంలేదు. అధికార యంత్రాంగమూ పట్టించుకోవడంలేదు. ప్రమాద నివేదికలు సకాలంలో ఇవ్వని దుస్థితిలో యంత్రాంగం ఉంది. జులై 17న అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని వసంత్ కెమికల్స్ కంపెనీలో ప్రమాదం జరిగి 14 రోజులు దాటుతున్నా ఇంకా నివేదిక ఒక కొలిక్కిరాలేదు. ఏడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించినా, ఇంతవరకు ఆ నివేదిక ఏ దశలో ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాద నివేదికలోని జాప్యమే, వసంత్ కెమికల్స్ విచారణలోనూ కన్పించింది. ఈ నివేదిక జాప్యానికి తోడు గతంలో వచ్చిన నివేదికలు కూడా అధికారులు బయట పెట్టడంలేదు. వసంత్ కెమికల్స్ బ్లాక్-6లో రియాక్టర్ పేలి ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ మృతి చెందిన ప్రమాదంపై అనకాపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి అధ్యక్షతన ఎనిమిది శాఖల అధికారులతో విచారణ కమిటీని ప్రమాద ఘటన రోజున కలెక్టర్ నియమించారు. ఈ కమిటీలో జిల్లా పరిశ్రమల అధికారి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, విఎస్ఇజెడ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఇఇ, డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సభ్యులుగా ఉన్నారు. వీరంతా వారివారి పరిశీలనలు ఆర్‌డిఒకు సమర్పించాల్సివున్నా, అవింకా పూర్తిస్థాయిలో చేరలేదు. దీంతో ప్రమాదంపై ఏడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించినా, ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ మరో రెండు రోజుల్లో నివేదిక అందజేస్తామని ప్రజాశక్తికి తెలిపారు.

ఫార్మా, ఇతర పరిశ్రమల ప్రమాద నివేదికలేవీ బయటపెట్టిన సందర్భాల్లేవు. సాహితీ, హెటిరో ఇతర ఫార్మా కంపెనీల ప్రమాద నివేదిక రహస్యంగా ఉంచారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీలోని సీడ్స్ కంపెనీలో 2022 జూన్ 3, ఆగస్టు 2న రెండు నెలల వ్యవధిలో విష వాయువుల లీకుతో 539 మంది మహిళా కార్మికులు అస్వస్థతతో ఆస్పత్రుల పాలయ్యారు. 539 మంది బాధితులు ఒక్కొక్కరికీ లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని ఎన్‌జిటి ఆదేశాలను ఈనాటికీ యాజమాన్యం అమలుచేయలేదు. 2022 జూన్ 3న జరిగిన ప్రమాదంపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి), అప్పటి జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి నేతృత్వంలో జరిగిన విచారణ, రెండోసారి ప్రమాదంపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) బృందం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) నివేదికలు బయటపెట్టలేదు. ఏ పరిశ్రమలో ప్రమాదం జరిగినా నివేదిక తొక్కిపెట్టడమే గానీ, బయటపెట్టి యాజమాన్యంపై ప్రమాదానికి తగిన చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యం ప్రమాద నియంత్రణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు.

100 రోజుల్లో 71 వేల ఇళ్ల స్టేజ్ అప్డేషన్

గృహ నిర్మాణ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విశాఖపట్టణం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని, వంద రోజుల ప్రణాళికను అనుసరించి 71,133 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని, ఆ దిశగా జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు తీవ్ర కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లే-అవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, వాటి పురోగతిపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో పరిస్థితిని, ఇళ్ల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్రామీణ పరిధిలోని 138 లేఅవుట్లు, అర్బన్ పరిధిలో 64 లేఅవుట్లు ఉన్నాయని, 1.39 లక్షల ఇళ్లు కేటాయించగా 1.29 ఇళ్లు మంజూరు అయ్యాయని వివరించారు. వాటిలో అన్ని దశల పనులు పూర్తి చేసుకున్నవి 23,995 ఇళ్లు ఉన్నాయని, మిగిలినవి ఇతర దశల్లో ఉన్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను చిత్తశుద్ధితో పనిచేసి చేరుకోవాలని చెప్పారు. 100 రోజులకు గాను 71,133 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని, 4,109 ఇళ్లను శ్లాబ్ లెవెల్ కు చేర్చాలని, 11,450 ఇళ్లను పూర్తి చేయాలని నిర్దేశించారు. గుత్తేదార్లు, లబ్ధిదారులతో మాట్లాడి, వారం రోజుల్లో అన్ని లేఅవుట్లలో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఆగస్టు 10వ తేదీ నుంచి రోజువారీ పురోగతిపై నివేదికలు సమర్పించాలని, అంతర్గత సమీక్షలు చేసుకోవాలని సూచించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ నిర్వహణకు లబ్ధిదారులు తప్పకుండా రావాలని, అధికారులకు, సిబ్బందికి సహకరించాలని హితవు పలికారు. ఆసక్తి కనబరచని గుత్తేదార్లతో మరొక్క సారి మాట్లాడి పనులను ప్రారంభించాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సమావేశంలో భాగంగా పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇసుక సరఫరాకు సంబంధించి సంబంధిత అధికారులకు చెబుతానని, లేఅవుట్ల వారీగా అవసరమైన ఇండెంట్ పెట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి భూకబ్జాలపై 4న సదస్సు : సిపిఐ

వార్త 2లో..

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి

వార్త 8లో..

246 కిలోల గంజాయి పట్టివేత

వార్త 3లో..

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

వార్త 6లో..

పింఛన్ల పంపిణీలో అనకాపల్లి జిల్లా ఫస్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ సొమ్ము పంపిణీలో అనకాపల్లి జిల్లాకు మొదటి స్థానం లభించింది. జిల్లాలో 2,62,624 మంది లబ్ధిదారుల్లో శుక్రవారం నాటికి 2,61,114 (99.43 శాతం) మంది ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది సొమ్ము అందజేశారు. పింఛన్ పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం లభించినందుకు కలెక్టర్ విజయకృష్ణన్ డిఆర్‌డిఎ అధికారులు, ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బందిని అభినందించారు. కలెక్టర్ సూచనల ప్రకారం పింఛన్ పంపిణీకి సమన్వయంతో చేసిన కృషికి మంచి ఫలితం వచ్చిందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.శచిదేవి, డిపిఎం పి.వెంకటరమణ తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎర్రమట్టి దిబ్బలను విధ్వంసంపై గనులశాఖకు జులై 18న జనసేన నేత పీతల మూర్తి యాదవ్ చేసిన ఫిర్యాదుపై స్పందించిన విశాఖ జిల్లా మైనింగ్ అధికారులు ది భీమినిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివే బిల్డింగు సొసైటీకి షో కాజ్ నోటీస్ జారీ చేశారు. ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొంది, మన వారసత్వ సంపదగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలలో ప్రభుత్వ శాఖల అనుమతులు పొందకుండా నేరెళ్లవలస గ్రామంలో ది భీమినిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగు సొసైటీ 278.95 ఎకరాలలో అక్రమంగా తవ్వకాలు చేసిందని, 39,454 క్యూబిక్ మీటర్ల కంకర ఉపయోగించారని మైనింగ్ అధికారులు తేల్చారు. ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్-1966ను ఉల్లంఘించారని, దీనిపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరారు. లేనిచో సొసైటీపై చట్ట పరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయ్యాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

స్థానిక ఎమ్మెల్సీ బొత్సే!

- ఉమ్మడి విశాఖలో 814 ఓట్లకు సుమారు 614 వైసిపివే
- 200 వరకూ కూటమి అభ్యర్థులు
- ఇతరులు 20

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి నుంచి ఉత్తరాంధ్ర సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ పేరును ఆ పార్టీ అధిష్టానం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరారు చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఈ అంశం సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. ఉమ్మడి విశాఖ జిల్లా నాయకులతో శుక్రవారం తాడేపల్లిలో భేటీ అయిన జగన్ ఈ నిర్ణయం ప్రకటించారు. బొత్స అభ్యర్థిత్వంపై దాదాపు ఏకాభిప్రాయం సాధించినట్టే. విశాఖ జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై గుడివాడ అమర్‌నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆశించినట్లు తెలుస్తోంది. ఉత్తరాంధ్రలో అన్ని స్థాయిల్లోనూ ఏకాభిప్రాయం, పార్టీని బలోపేతం చేసేందుకు సత్తిబాబు అయితే సరైన నాయకుడిగా అధిష్టానం భావించినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

13 నుంచి నామినేషన్‌లు...

ఈ నెల 13 నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. తెలుగుదేశం పార్టీ లేదా కూటమి నుంచి అభ్యర్థిని పెట్టినా గెలుపుపై గ్యారెంటీ ఉండే పరిస్థితి లేదు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 814 ఓట్లు (ఎంపిటిసి, జెడ్‌పిటిసి) స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులవి ఉన్నాయి. దీంట్లో 615 వరకూ వైసిపి ఓట్లే ఉన్నాయి. సిపిఎం ఇతర వామపక్షాలు, ఇండిపెండెంట్లు కలిపితో మరో 20 వరకూ ఉంటాయి. ఈ నేపథ్యంలో టిడిపికి ఈ గెలుపు అంత సులువు కాదు. అయితే టిడిపి పోటీ పెడుతుందా? గౌరవంగా తప్పుకుంటుందా? అన్నది చూడాల్సిందే. రాష్ట్రంలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'స్థానిక' ఎమ్మెల్సీ బొత్సే!

అధికారం కోల్పోయిన వైసిపి తన పట్టును నిలుపుకోడానికి ఇదే అవకాశంగా భావిస్తోంది. తమ ప్రజా ప్రతినిధుల ఓట్లతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీని కైవసం చేసుకునే దిశగా వైసిపి ప్రయత్నాలు ఆరంభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైసిపికి ప్రజల్లో బలం కొంత ఇప్పటికే ఉంది. కాబట్టి సునాయాసంగా సత్తిబాబు ఎమ్మెల్సీ కావడం ఖాయం అనిపిస్తోంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామాలు, గ్రూపులు.. సత్తిబాబుకు ఈ రాజకీయాల్లో తల పండిపోయిన విషయం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.

వైసిపి భూకబ్జాలపై 4న సదస్సు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి నాయకుల భూకబ్జాలపై ఈ నెల 4న చిత్తూరు జిల్లా మదనపల్లెలో సదస్సు నిర్వహించనున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. విశాఖలో గురువారం నిర్వహించిన సిపిఐ విశాఖ జిల్లా కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో ఆయన తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. మదనపల్లిలో ఏకంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే రెవెన్యూ రికార్డులను తగలబెట్టారని, దీనికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని సాకు చెప్పే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ వైసిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని, దీనిపై బాధితులను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో నియంత మాదిరిగా జగన్ పరిపాలన సాగించాలని విమర్శించారు. సమస్యలను వివరించడం కోసం ప్రయత్నించిన ప్రతిపక్ష పార్టీలకు ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. జగన్ పాలనలో సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సిఎంఒలో ధనుంజయరెడ్డిలు దందా సాగించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో అనేక హామీలపై కూడా పోరాటాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి బిజెపికి గట్టి పోటీ ఇచ్చిందన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బిజెపి వ్యతిరేకులపై ఈడీ, ఐటి, సిబిఐలను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. సిపిఐ శతాబ్ది వేడుకలు డిసెంబర్ 26 ప్రారంభమై ఏడాది పాటు జరుగుతాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా పార్టీ కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్పొరేటర్ ఎ.జె స్టాలిన్, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎ. విమల, ఎం.మన్మధరావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నామినేటెడ్ పదవులలో న్యాయవాదులకు అవకాశం : గండి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలోనూ వివిధ నామినేటెడ్ పోస్టులలో న్యాయవాదులకు అవకాశాలు కల్పించే విధంగా తాను కృషిచేస్తానని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి హామీ ఇచ్చారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ ఆధ్వర్యాన విశాఖపట్నం న్యాయవాదులు, వివిధ డిపార్ట్‌మెంట్‌లలో గల నామినేటడ్ పదవులు ఆశిస్తూ ఆశిస్తూ గండి బాబ్జీకి అభ్యర్థన పత్రాలను సమర్పించారు. దీనికి గండి బాబ్జి స్పందిస్తూ పార్టీకి సేవలు చేసిన న్యాయవాదులకు మంచి పదవులతో గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో గొంప సత్యనారాయణ, భరత్, వేణు సుబ్రహ్మణ్యం, దుర్గా ప్రసాద్, సతీష్, అప్పలనాయుడు, రమేష్, శ్రీను ఉన్నారు.

నటనలో 8 అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఫిల్మ్ యాక్టింగ్ వర్క్ షాప్ రెండవ రోజైన శుక్రవారం ఎంతో ఉత్సాహంగా సాగింది. నటనలో ఉన్నటువంటి వాయిస్ మాడ్యులేషన్, బాడీ లాంగ్వేజ్, ఆడిషన్స్ ఎలా ఇవ్వాలి వంటి ఎనిమిది ప్రాథమిక అంశాలపై ఎయు పూర్వ ప్రొఫెసర్ బాబీ వర్ధన్, ప్రముఖ రంగస్థల, సినీ నటులు ఎఫ్ఎం బాబాయ్ (దాడి త్రినాధరావు) తర్ఫీదునిచ్చారు. రెండవ రోజు కూడా 70 మంది కళాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వై.అప్పారావు, సహాయ కార్యదర్శి ఉమామహేష్, ఎస్ఎస్.దుర్గ, కుమార్ రాజ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రోలైట్స్ డ్రింక్ 'అడ్వాన్స్ కేర్' ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : హైడ్రేషన్, శక్తి, రోగ నిరోధక శక్తే లక్ష్యంగా ఒఆర్ఎస్ఎల్ ఆధ్వర్యాన సరికొత్త ఎలక్ట్రోలైట్స్ డ్రింక్ 'అడ్వాన్స్ కేర్' మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చిందని మెడికల్ సేఫ్టీ సైన్సెస్ హెడ్ డాక్టర్ ప్రీతి ఠాకోర్ తెలిపారు. కేర్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ జనరల్ సర్జన్ డాక్టర్ బి.రవీంద్రరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, ఇది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుందని, హైడ్రేషన్ అవసరాలను తీర్చడంలో సహాయపడుతుందని తెలిపారు. సరైన మొత్తంలో చక్కెర, ఎలక్ట్రోలైట్స్, జింక్, సెలీనియం వంటి రోగనిరోధక పోషకాల ప్రత్యేకమైన మిశ్రమంతో రూపొందించినట్లు పేర్కొన్నారు. ఒఆర్ఎస్ఎల్ ఇమ్యూనిటీ అనేది బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉంటుందన్నారు. డాక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, శరీరంలో ఎలక్ట్రోలైట్‌లతో పాటు ద్రవాల లోపం ఉన్నప్పుడు డిహైడ్రేషన్ ఏర్పడే పరిస్థితి ఉంటుందని తెలిపారు. శరీరంలో ద్రవ సమ తుల్యతను కాపాడు కోవడానికి నీరు మాత్రమే సరి పోదన్నారు. రోగులు రోగ నిరోధక శక్తిని పెంచు కోవడానికి ఈ కొత్త ఆవిష్కరణ దోహద పడుతుందని తెలిపారు.

చేనేత వస్త్రాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -ఎంవిపి. కాలనీ: చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరవని వీ హెల్త్ కేర్, వీ డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ అన్నారు. స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీన బీచ్ రోడ్‌లో నిర్వహించనున్న 3 కిలోమీటర్ల సారీ వాక్ పోస్టర్‌ను శుక్రవారం వీ డెంటల్ హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న సారీ వాక్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటి ప్రతినిధి డాక్టర్ బిపిఎస్.కల్యాణి అన్నారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి, సిహెచ్.పార్వతి, కె.రమ్య, పి.అశోక్, మేరి, తులసి, రాజ్య లక్ష్మి, ప్రశాంతి, పావని, సీత పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ కాలేజీ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌ఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్ వి.లక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, హాస్టళ్లలో మౌలిక వసతులు, సొంత భవనాలు ముఖ్యమన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ నెల 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18,19 తేదీలలో వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించే మెగా ఫొటో ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను విజయమెడికల్ సెంటర్ ఎమ్‌డి డాక్టర్ కె.సుమన్, డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి, సీనియర్ ఫొటోజర్నలిస్ట్ ఎంవి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఈ ఫొటో ప్రదర్శన ఆంధ్ర విశ్వకళపరిషత్ హిందీ విభాగం సెమినార్ హాల్లో జరుగుతుందని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సుమారు 30 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొంటున్నారని తెలిపారు. సొసైటీ నిర్వహించే ఫొటోగ్రఫీపై అవగాహనా సదస్సులు, ఫొటో షూట్స్‌లో పాల్గొనాలన్న ఉత్సాహం ఉన్న ఫొటోగ్రాఫర్స్ 9393909053 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిఎన్.షేత్, ఉపాధ్యక్షులు జగపతిరాజు, సభ్యులు కెఎంకె.రమేష్, బిఎన్.ప్రసాద్, వేణుగోపాలరావు, సన్నీ పాల్గొన్నారు.

NAME CHANGE

I, PARISERLA RAJANIKUMARI W/o. PARISERLA SATYANARAYANA previously called PARISERLA RAJANI, Resident of D.No. 8-40/1, Swarna Bharathi Nagar, Peda Rushikonda, Visakhapatnam, Visakhapatnam District, Andhra Pradesh - 530045, Now changed my name from **PARISERLA RAJANI** to **PARISERLA RAJANIKUMARI.** Henceforth I will be called as **PARISERLA RAJANIKUMARI** for all purposes.

N THE HON'BLE COURT OF THE 1ST ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM O.S.No.302/2023

Between:
Sri Gorla Krishna Murthi and 2 others . . . Plaintiffs
And:
Smt. Chikkala Deepthi Hiranmai . . . Defendants

Notice to Defendants No.1 and 2:
1.Smt. Chikkala Deepthi Hiranmai, W/o Deepak, D.No.50-59-8/1, Seethammapeta, 3rd lane, Rejendra Nagar, Visakhapatnam.
2.Smt. Chikkala Deepthi Hiranmai, W/o Deepak, D.No.50-59-8/1, Seethammapeta 3rd lane, Rejendra Nagar, Visakhapatnam.

NOTICE

Whereas the above named Petitioners has filed the above suit O.S.No.302/2023 you and others. You are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material question relating to the said Petition or who shall be accompanied by some person able to answer all such questions on the day to **09-08-2024 at 10-30 AM** in the forenoon to answer the claim. Therefore take notice that in default of your appearance on that day and hour before mentioned the Petition will be heard and determined in your absence.

M.VENKATA RAMANA
Advocate Visakhapatnam
Cell : 9885050986

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM O.S.1055/2023

Between:
Kotu Hema Santhoshi Bala Kumari & Another ...Plaintiffs
And:
Smt. Molleti Lakshmi @ Lakshmi Devi ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Smt. Molleti Lakshmi @ Lakshmi Devi,
W/o. late Rama Rao, Hindu, aged about 62 years, R/at D.No.44-15-41/2, 80 Feet Road,Thatichetlapalem, Akkayyapalem, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **23-08-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-08-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
B.V. APPA RAO,
Advocate, Visakhapatnam.
Cell: 9849370417.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM E.A.14/2020 in E.P.12/2017 in O.S.344/2012

Between:
Smt. R. Purnima...Petitioner/D.Hr
And:
R. Appanna (died) others ...Respondents/J.Drs

NOTICE

To,
5th Respondent/J.Dr:
Smt. Botta Thirumala Devi,
W/o. Bala Kotewara Rao, R/at Allipuram, Near Board School, Visakhapatnam.

Take notice that the above numbered E.A.14/2020 in E.P.12/2017 in O.S.344/2012, which was filed by petitioner/D.Hr against to Respondents/J.Drs for recovery of amounts and for other reliefs and the same is posted to **22-08-2024.** That you are, therefore, required to appear either in person or through a properly instructed Advocate at **10:30 A.M** on **22-08-2024** in the above captioned Court failing which you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO,
Advocate
Visakhapatnam,
Cell:9441595993.

IN THE HON'BLE COURT OF THE DISTRICT FAMILY JUDGE CUM V ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM F.C.O.P.1836/2023

Between:
Sunku (Kanchuparthi) Kanaka Mahalakshmi ...Petitioner
And:
Sri Sunku Srinivasa Rao @ Srinu ...Respondent

NOTICE

To, **The Respondent:**
Sri Sanku Srinivasa Rao @ Srinu
S/o. Late Krishna, Hindu, aged 40 years, R/at D.No.31-17-15/9, Kantamvari Veedhi, Allipuram, Visakhapatnam-530004.

Please take notice that the above FCOP.1836/2023 filed by the petitioner against the respondent and the matter stands posted to **13-08-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **13-08-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K.V. SRI HARI,
Advocate
Visakhapatnam,
Cell: 9392377200.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT :: HYDERABAD O.S. No. 1325 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr. Manager(Law)&Authorized Officer, ...Plaintiff
And
Sri.V.V.Satyanarayana Reddy ...Defendant

To
Sri.V.V.Satyanarayana Reddy, S/o. Venkata Reddy, Aged about 53 Years, Occ: Business, R/o.H.No.27-8-305. Flat No.504, Sai Sannidhi Apts, Srinagar, Gajuwaka, Visakhapatnam, A.P-530025.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 2,49,736-96ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 19-08-2024.

In case of your failure to attend before the Court on 19-08-2024 at 10-30 a.m. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T. Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE VIJUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD O.S. No. 1993 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law)&Authorized Officer, **...Plaintiff**
And
Sri.Katam Ravi Kumar, **....Defendant**

To
Sri.Katam Ravi Kumar, S/o. K.Sampath Rao, Aged about 51 Year, Occ: Business, R/o. D.No.39-11-38, Near Brudhavan Gardens, Muralinagar, Visakhapatnam, A.P-530007.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum Rs.1,05,478-83ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 19-08-2024.

In case of your failure to attend before the Court on 19-08-2024 at 10-30 A.M either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village,
HYDERABAD-50.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పారిశుధ్య పనులు చేస్తున్న సూపర్‌వైజర్ శ్రీనివాస్, కార్మికులు

ప్రజాశక్తి- వేపగుంట : స్వచ్ఛభారత్‌లో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్, అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ నరేష్ కుమార్ సూచనల మేరకు ఎనిమిదో జోన్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. జెడసి హేమవతి, ఎఎంహెచ్ఒ కృష్ణంరాజు, శానిటేషన్ సూపర్వైజర్ వెంకట రమణ సిబ్బందిని అప్రమత్తం చేసి, వార్డుల్లో పరిశుభ్రతా పనులు చేపడుతున్నారు. ఈ మేరకు 92వ వార్డులో పెట్ సోర్టింగ్ సూపర్వైజర్ దమ్ము శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 20మంది పారిశుధ్య కార్మికులతో వుడాకాలనీలో పార్కులు, గెడ్డలు, వీధులు శుభ్రపరిచే పనులు చేపట్టారు

246 కిలోల గంజాయి పట్టివేత

పట్టుబడ్డ నిందితులతో ఎస్‌పి దీపిక, పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల 246 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఎస్‌పి ఎం.దీపిక వివరాలను వెల్లడించారు. చీడికాడ మండల పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో ఈ నెల 1వ తేదీన మంచాల శివారులో ఎస్ఐ జి నారాయణరావు, సిబ్బంది దాడులు నిర్వహించారు. రూ.7.50 లక్షల విలువచేసే 150 కిలోల గంజాయిని, ఒక ఆటో, ద్విచక్ర వాహనం, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రావికమతం మండలం కవగుంట గ్రామ సమీపంలో ఈ నెల 1వ తేదీన ఎస్ఐ ధనుంజయనాయుడు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి రూ.4.80 లక్షల విలువ చేసే 96 కిలోల గంజాయి, పాసింజర్ వ్యాను, మొబైల్ ఫోన్లు, రూ.500 స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ సిబ్బంది స్పందించి గంజాయిని పట్టుకున్న పోలీసులను ఎస్‌పి అభినందించారు.

బైక్ దొంగతనాలతో బెంబేలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో వరస బైక్ దొంగతనాలతో వాహన యజమానులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో కొండ్రాం పంచాయతీ గొంతువానిపాలెం గ్రామం చెక్‌పోస్టు వద్ద రెండు రోజుల క్రితం బైక్ దొంగతనాలు జరిగాయనివాహన యజమానులు వాపోతున్నారు ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఇంటి ముందు పార్కింగ్ చేసిన గొంతువానిపాలెం గ్రామానికి చెందిన ముమ్మర్ కిరణ్ యమహా ఆర్ 15 బైకుతెల్లారి చూసేసరికి మాయమైందని బాధితుడు వాపోతున్నాడు. దీనిపై బాధితుడు ఆనందపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన పోలీసులు బైక్ దొంగలను పట్టుకునే చర్యలను ముమ్మరం చేశారు. గ్రామంలోని సిసి కెమెరాల పుటేజీని పరిశీలిస్తే, పెందుర్తి వైపు నుంచి ఒకే బైక్‌పై ముగ్గురుగా వచ్చిన దొంగల ముఠా, ఇక్కడ బైక్‌లను ఎత్తుకెళుతున్నట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని పోలీసులకు తెలియపరిచారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి, బైక్ దొంగలను గుర్తించి అరెస్ట్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యుత్ వైరు తెగడంతో కలకలం

విద్యుత్ ఎఇఇ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- పెందుర్తి: జివిఎంసి 94వ వార్డు ఆర్.ఆర్. వెంకటాపురంలో చివరన్నున్న విద్యుత్ స్తంభం వైరు తెగడంతో కాలనీవాసులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి భయాందోళనకు గురయ్యారు. అందరూ ఇళ్లల్లోంచి బయటకు వచ్చేసారు. జనసేన నేతలు పార్వతి చైతన్య శ్రీనివాస వెంటనే స్పందించి, సంఘటనాస్థలికి వెళ్ళి, అధికారులను అప్రమత్తం చేశారు సమాచారం అందుకున్న విద్యుత్ లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తర్వాత ఎఇఇ రమణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. విద్యుత్ వైర్లు పాతవి కావడంతో తెగిపడిందని, వీటిస్థానే కొత్త విద్యుత్ వైర్లు ఏర్పాటుకు టెండర్లు పిలిచామని ప్రజలకు వివరించారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని చెప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. జరిగిన సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు స్పందించి, ఫోనులో విద్యుత్‌శాఖాధికారులతో మాట్లాడి, ప్రమాదానికి ఆస్కారం లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు..

ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎన్ఎడి సిఐటియు యూనియన్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎడి సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు, సంబంధిత యాజమాన్యాల ప్రవర్తిస్తున్న అభ్యంతరకర తీరును నిరసిస్తూ వారం రోజుల నిరసనలో భాగంగా శుక్రవారం గేటు వద్ద ఎన్ఎడి సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, రక్షణ రంగంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఓటి చేసిన కార్మికులకు హెచ్ఆర్ఎ కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని, వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని, అలాగే 2004 తర్వాత విధుల్లో చేరిన కార్మికులకు అమలు చేసే నూతన పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో పెద్దఎత్తున యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి దోహదం / కేంద్ర బడ్జెట్‌పై గీతం సదస్సులో నిపుణులు

జ్యోతిప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్ర బడ్జెట్లో వివిధ విభాగాలకు కేటాయింపులు దేశంలో పారిశ్రామిక ప్రగతికి దోహదపడేలా ఉన్నాయని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడ్జెట్ సమీక్షలో జిఎస్ఆర్ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ఈఎంది శంకరరావు మాట్లాడుతూ మౌలికరంగానికి, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు బడ్జెట్‌లో కేటాయింపులు దేశ ఆర్థిక ప్రగతికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి దారి తీస్తుందన్నారు. శ్రావణి షిప్పింగ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగ సవాళ్లకు పరిష్కారం చూపి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఊపిరి పోసేదిగా బడ్జెట్ ఉందన్నారు. సిడిబి మాజీ అధికారి వివిఎస్.రావు,. ఆర్‌కె. సంఫ్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణ, ఐఐఎమ్ విశాఖఅసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కల్యాణ్ మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు అధ్యక్షత వహించిన సదస్సులో డాక్టర్ రాధా రఘురామపాత్రుని కేంద్ర బడ్జెట్ విశేషాలను, కీలక అంశాలను వివరించారు. డాక్టర్ ఇష్రత్ నాజ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అడ్డదారిలో ఆస్తిని కాజేయాలని చూసిన నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి- సీతమ్మధార: అడ్డదారులతో ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నించిన నలుగుర్ని ఫోర్త్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నకిలీ పత్రాలు, తప్పుడు దస్తావేజులు, మోసపూరిత డాక్యుమెంట్లుతో చట్టాన్ని, న్యాయాన్ని ధిక్కరించి వేరొకరి ఆస్తిని సొంతం చేసుకునేందుకు యత్నించి,. న్యాయస్థానం ఆదేశాలతో అరెస్టయ్యారు. పోలీసులపైనా తప్పుడు ఫిర్యాదులతో హడావుడి చేసిన వారిని, సిపి ఆదేశాలతో అరెస్ట్ చేశారు. ఆస్తి కోసం ఒక కుటుంబాన్ని క్షోభకు గురిచేసిన తండ్రి, ఇద్దరు కుమార్తెలు, అల్లుడ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలివి.

లలితానగర్‌కు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి కొల్లి కృష్ణారెడ్డి, కృష్ణవేణి దంపతులు ఆస్తిని కృష్ణారెడ్డి తమ్ముడు తమ్మారెడ్డితోపాటు అతని కుమార్తెలు దుర్గాసి రాజారాజేశ్వరి, చిన్న కుమార్తె విజయనగరానికి చెందిన కొవ్వూరి హిమప్రియ, చిన్న అల్లుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి కాజేయాలని ప్రయత్నించారు. సంతానం లేని కృష్ణవేణి, భర్త కృష్ణారెడ్డి మరణానంతరం నిందితుల్లో ఒకరైన మరిది కుమార్తె రాజారాజేశ్వరిని పెంచుకోవాలని భావించినా, ఆమె తీరు సరిగా లేకపోవడంతో మానుకుంది. అయినప్పటికీ, లలితానగర్‌లో తనకున్న రెండంతుల ఇంటిలో పై అంతస్తును రాజేశ్వరికి, కింది అంతస్తును వృద్ధాప్యంలో తన బాగోగులు చూసిన తమ్ముడు వాసు పేరిట రిజిస్టర్ వీలునామాకూడా రాసింది. అయితే కృష్ణవేణి, వాసుల మరణానంతరం మొత్తం ఆస్తిని కాజేయాలన్న దురాశతో తమ్మారెడ్డి, తమ్మారెడ్డి పెద్ద కుమార్తె రాజరాజేశ్వరి, చిన్న కుమార్తె కొవ్వూరి హిమప్రియ, చిన్న అల్లుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పక్కా స్కెచ్ వేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి ఆక్రమించుకున్నారు. జివిఎంసి, ఎపిఇపిడిసిఎల్ ద్వారా అవసరమైన తప్పుడు డాక్యుమెంట్లను సిద్ధం చేసుకున్నారు. బాధితులు వాసు కుటుంబీకులు రెవెన్యూ,పోలీసులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరకు కోర్టును ఆశ్రయించడంతోపాటు, నగర పోలీసు కమిషనర్‌కు తమ సమస్యను విన్నవించడంతో ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. తప్పుడు పత్రాలతో ఆస్తిని కాజేయాలని చూసిన నలుగురిని శుక్రవారం సిఐ విజయ్ కుమార్ ఆదేశాలతో ఎస్ఐలు వెంకట్రావు, ప్రమీల, ఏఎస్ఐ రాంభట్ల శ్రీనివాస్, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేరాలు ఘోరాలు

దారి దోపిడీ కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన దారి దోపిడీ కేసులో నలుగురిని అరెస్టు చేశామని క్రైమ్ డిసిపి వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇసుకతోట ప్రాంతానికి చెందిన ఆర్‌టిసి డ్రైవర్ గనిరెడ్డి మారినాయుడు విధులు ముగించుకుని తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా మద్దిలపాలెం అపోలో ఫార్మసీ వద్ద నలుగురు యువకులు అతని బ్యాగు లాక్కొని పరిగెత్తగా వారి వెంట మారినాయుడు పరిగెత్తారని, దీంతో మారినాడును వారు తీవ్రంగా గాయపరిచారని వివరించారు.

ఈ క్రమంలో బాధితుడు 112కు ఫోన్ చేసి సమాచారం అందించగా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వారిపాలేనికి చెందిన జగన్నాథ్ కిరణ్, పిలక సదానందరెడ్డి తోపాటు మరో ఇద్దరు మైనర్ నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు ఈ సంఘటనలో చోరీకి గురైన రూ.3 వేలుతో పాటు బ్యాగును రికవరీ చేసినట్టు చెప్పారు. మీడియా సమావేశంలో ఈస్ట్ ఎసిపి ఎ.వెంకట్రావు, ద్వారకా క్రైమ్ సిఐ సిహెచ్ శ్రీనివాస రావు, ఎస్ఐలు భాస్కర్, సునీల్, సాల్మన్లు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు విశాఖపట్నం క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గత నెల 28వ తేదీ రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సుంకరబోతు బంగారమ్మను వరుసకు మరిది అయిన సుంకరబోతు దుర్గారావు చంపి బంగారపు గొలుసు, చెవిదిద్దులు, మొబైల్ ఫోన్‌ను దొంగిలించుకొని పారిపోయాడని మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ కేసులో సుంకరబోతు దుర్గారావు నిందితుడినిగా గుర్తించి శుక్రవారం గోపాలపట్నం సమీపంలో అరెస్ట్ చేసి, అతడి నుంచి రూ.60 వేలు విలువ చేసే బంగారపు గొలుసు, చెవి దిద్దులు రికవరీ చేసినట్లు వివరించారు. మృతురాలిని ముద్దాయి దుప్పటి ముఖానికి కప్పి ఊపిరాడకుండా చేసి చంపాడని తెలిపారు.

అంతర్రాష్ట దొంగ అరెస్టు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: వృద్ధులు, నిస్సహాయ మహిళల నుంచి ఎటిఎం కార్డులను తస్కరించి వాటి నుంచి నగదు చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు నగర క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గత నెల 13వ తేదీన పాత గాజువాకకు చెందిన ఒక మహిళ ఎటిఎంకు వెళ్లి డబ్బులు విత్ డ్రా చేయటానికి ప్రయత్నించగా ఆ సమయంలో ఆమె కార్డును దొంగిలించి దాని నుండి దఫాదఫాలుగా సుమారు ఆరు లక్షలు విత్ డ్రా చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాజువాక పోలీసులు విచారణ అనంతరం పశ్చిమ బెంగాల్‌కు చెందిన సంజయ్ ఘోరష్ (37)ను ఒడిశా రాష్ట్రంలోని గుర్నుగూడ రైల్వే స్టేషన్లో గత నెల 31వ తేదీన అరెస్టు చేసి విశాఖకు తీసుకువచ్చినట్లు వివరించారు. నిందితుడు దొంగలించిన ఎటిఎం కార్డుల ద్వారా సుమారు 29 ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడని, వాటి విలువ రూ.7.65 లక్షలుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు.

నిందితుని వద్ద వివిధ బ్యాంకులకు చెందిన 50 ఎటిఎం కార్డులను లభించాయని చెప్పారు. ఇతనిపై విజయనగరం జిల్లా ఎస్.కోట, పార్వతీపురంతో పాటు నగరంలోని ద్వారక, గాజువాక పోలీస్ స్టేషన్లో కేసులు నమోదై ఉన్నాయని, ఇతడు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, మద్రాస్ రాష్ట్రాల్లో పలు దొంగతనాల్లో నిందితుడిగా ఉన్నాడని ఆమె తెలిపారు.

హోటల్‌లో చోరీ

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ రామేశ్వరం ఫుడ్స్ హోటల్‌లో గురువారం అర్ధరాత్రి 2.15గంటల సమయంలో చోరీ జరిగింది. సిసి పుటేజీలో రికార్డు అయిన వీడియోలోని వివరాల మేరకు ఇద్దరు యువకులు హోటల్ ముందునుంచి వచ్చి వంటశాలలోకి చొరబడి, కౌంటర్ కిందనున్న 30 పాలప్యాకెట్లను దొంగిలించుకుపోయారు.

నూతన చట్టాలపై అవగాహన

అవగాహన సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తి వెంకటసీతమ్మ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డు శంభువానిపాలెంలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ మెజిస్ట్రేట్ వెంకట సీతమ్మ పాల్గొని, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే హెల్మెట్, షీట్‌బెల్ట్ లేకుండా వాహనాల్లో ప్రయాణించడం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలతోపాటు, వాటిని కలిగి ఉండడం వల్ల చట్టపరంగా ఎదురయ్యే కేసులు, వాటికి పడే కఠిన శిక్షలను గురించి వివరించారు. సీజనల్‌గా ప్రబలే వ్యాధులపై అవగాహన కలిగి, సత్వర వైద్యం పొందడం ద్వారా ప్రాణాపాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కెజిహెచ్, గీతం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ఎసిపి సునీల్, సిఐ వై.రామకృష్ణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీను జన్మదిన వేడుకలు

మిత్రబృందంతో కలిసి కేకు కట్ చేస్తున్న జాగారపు శ్రీను

ప్రజాశక్తి -గాజువాక : మదర్ తెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జాగారపు శ్రీను జన్మదిన వేడుకలు శుక్రవారం సమతానగర్ జంక్షన్లో ఘనంగా నిర్వహించారు. శ్రీను మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో శ్రీను చేసిన సేవలను కొనియాడారు. గాజువాక జంక్షన్లో మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు, ప్రాణాపాయంలో ఉన్నవారికి అండగా ఉండేందుకు రక్తదాన శిబిరాలను నిర్వహించి, దాదాపు 16వేల రక్తపు యూనిట్లను దాతల నుంచి సేకరించారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేస్తున్న జాగారపు శ్రీనుకు పలువురు మిత్రులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కొండవాలులో శిథిల ఇళ్లను గుర్తించండి

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌సి కృష్ణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి ఐదో జోన్ పరిధిలో ప్రస్తుతం వర్షాల సీజన్‌లో కొండవాలు ప్రాంతాల్లో నివాసితుల ప్రస్తుత పరిస్థితి, శిథిలమైన ఇళ్లను గుర్తించి నివేదించాలని జోనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో ఐదోజోన్ పరిధిలోని సచివాలయాల ప్లానింగ్, అమెనిటీస్ సెక్రెటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు కొండవాలు ప్రాంతాల్లో వాస్తవ స్థితిపై పరిశీలన చేయాలని, ప్రమాదాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.కార్యక్రమంలో ఎసిపి వెంకటరావు, టిపిఒ విజయ్‌కుమార్, ఏఇలు పాల్గొన్నారు

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అనుబంధ గీతం న్యాయకళాశాల, లీగల్ ఎయిడ్ సెల్ ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణ, రహదారి భద్రతపై శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన గీతం న్యాయకళాశాల డీన్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు, పాదచారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బైకిస్టులు హెల్మెట్‌ను ధరించడం, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాల్సిన అవశ్యకత, పెట్టుకోకుంటే ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా అనుసరించాలని, చట్టాలను గౌరవించాలని సూచించారు. గీతం న్యాయ సలహా కేంద్ర కన్వీనర్ డాక్టర్ సిహెచ్ లక్షణరావు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలలో న్యాయ సేవాధికార సంస్థ సామాన్య ప్రజలకు అందించిన న్యాయసేవలను వివరించారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, డాక్టర్ హరీష్‌వర్మ, ఎన్ఎ.రాజు, పూర్ణిమ, చిత్ర సక్సేనా, నవీన్ సిస్తా, లా విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న గీతం న్యాయవిద్యార్థులు

వర్గీకరణతో ఎస్‌సిలను విభజించొద్దు

సుప్రీం తీర్పుపై మాల మహానాడు నిరసన

నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : ఎస్‌సి వర్గీకరణ సమంజసం కాదని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావుస్పష్టం చేశారు. ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌సి వర్గీకరణపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం స్థానిక జంక్షన్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలోనూ సిఎంగా చంద్రబాబు ఎస్‌సి వర్గీకరణకు అనుకూల వైఖరితోనే అధికారానికి దూరమయ్యారని, ఇప్పుడూ బాబు వైఖరిలో మార్పులేదని మండిపడ్డారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి వర్గీకరణపై ఇదే విధానం కొనసాగిస్తే 2029 ఎన్నికల్లో ఆయా పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు. ఎన్నో ఏళ్లగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మాల మాదిగ ఉపకులాల మధ్య వర్గీకరణ పేరుతో విభజించడం సబబు కాదన్నారు.ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పును వెనక్కు తీసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు గుడివాడ కిరణ్, సూర్యనారాయణ, మామిడి శివ, రవ్వ ఈశ్వరరావు, కె హర్షవర్ధన్, ఎం తీన్‌మూర్తి, ఎం ఏడుకొండలు పాల్గొన్నారు. అంతకుముందు జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

ప్రైవేట్ విద్యార్థులకూ ప్రతిభా అవార్డులివ్వాలి

ప్రజాశక్తి- గాజువాక: ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రతిభా అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజును విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న ప్రైవేటు పాఠశాలల సమస్యలను వివరించారు. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభ అవార్డులతోపాటు ట్రిపుల్ ఐటి సీట్లు కేటాయించాలని కోరారు. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి, తరగతులకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుందరం, కార్యదర్శి సుబ్రహ్మణ్యంరాజు, గౌరవాధ్యక్షుడు సింహాచలం, జనార్థన్, ఫైనాన్స్ సెక్రటరీ పి.భాస్కరరావు, అప్పలనాయుడు, గణపతిరావు ఉన్నారు.

విద్యా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్సా ప్రతినిధులు

సిర్లపాలెం సమస్యలపై గంటాకు వినతి

గంటాతో గౌరునాయుడు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని సిర్లపాలెం గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని గ్రామ టిడిపి అధ్యక్షులు కోరాడ గౌరినాయుడు కోరారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి దృష్టికి సమస్యలను తెచ్చారు. సిర్లపాలెం గ్రామంలో ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలని, ఎంకమ్మ చెరువు, గెడ్డ పూడికలు తొలగించాలని, మరిడమ్మ గుడి రోడ్డు ఏర్పాటు చేయాలని, సగంలోనే నిలిచిపోయిన రామాలయ నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ, ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మకు ఆషాఢమాసం బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యార్చనలతోపాటు కుంకుమపూజలు, పుష్పార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందించారు.కార్యక్రమంలో ఆలయ ధరకర్త పిళ్లా చంద్రశేఖర్, అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, పివిజి. అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు పాల్గొన్నారు.

పెందుర్తి: జివిఎంసి 92వ వార్డు పద్మనాభనగర్ కొండపై కొలువైన ఆదిశక్తి నాగ మానసాదేవి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి సారె ఊరేగించారు.

అమ్మవార్లకు ఆషాఢమాస సారె

మధురవాడ : ఆషాఢమాస బహుళ చతుర్దశి సందర్భంగా రేవళ్లపాలెం గ్రామస్తులు శుక్రవారం గ్రామదేవతలు బంగారమ్మ, భూలోకమాత అమ్మవార్లకు ఆషాఢమాస సారె సమర్పించారు.

నీటి శుభ్రతపై ఇంటింటా ప్రచారం

ఇళ్ల వద్దే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆనందపురం: వర్షాల సీజన్‌లో తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా, ఇతరత్రా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన నీటిని ప్రతిఒక్కరూ తాగాలని జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు, బ్రోచర్లు పంచుతూ ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని వేములవలస, పెద్దిపాలెం గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో జల్‌జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.ఆనంద్ పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రమైన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం ఎంతో మంచిదన్నారు. అలాగే వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లలోని బోర్లు, బావుల నీటి నాణ్యతను అక్కడికక్కడే పరీక్షించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం నాగభూషణం, సచివాలయం గ్రామ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు

లెప్రసీ సర్వేపై పరిశీలన

గాజువాక పిహెచ్‌సి సందర్శనలో ఎన్ఎల్ఇపి జెడి దేవసాగర్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్ఎల్ఇపి జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ శుక్రవారం సందర్శించారు. నెల రోజులుగా పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేపై ఆరా తీశారు. గాజువాక పిహెచ్‌సి పరిధిలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లెప్రసీస్ సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సుధాకర్, డాక్టర్ నాగప్పారావు, జి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం, ఇతర నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా 33/11కెవి పద్మనాభపురం సబ్‌స్టేషన్ పరిధిలో బంటాకాలనీ 11కెవి ఫీడర్‌లో ఈ నెల 3న శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ అధికారులు తెలిపారు. బంటాకాలనీ ఫీడర్ పరిధిలోని బంటాకాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్, రవినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మత్తు జోలికి పోవద్దు

ప్రజాశక్తి - తగరపువలస : మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్ర వారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రామంలో నినాదాలు చేస్తూ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్ఎం సత్య నారాయణ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సుల ప్రవేశ గడువు పెంపు

ప్రజాశక్తి -గాజువాక :ఇగ్నో దూరవిద్య విధానంలో వివిధ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశానికి గడువును ఈనెల 14 వరకు గడువు పెంచినట్లు ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్వి.కృష్ణ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈసారి డిగ్రీ చేసేవారు రెండు కోర్సులను ఒకేసారి చేసుకునే అవకాశాన్ని యుజిసి కల్పించిందని తెలిపారు.

డ్రైనేజీల్లో తాగునీటి పైపులైన్లు

- జివిఎంసిలో విలీనమై 17ఏళ్లయినా నేటికీ మార్చని వైనం
- అనారోగ్యం పాలవుతున్న విలీన గ్రామాల ప్రజలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

డ్రైనేజీలో ఉన్న తాగునీటి పైపులైన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలోని విలీన పంచాయతీల్లో తాగునీటి పైపులైన్లు డ్రైనేజీల్లో ఉండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ గ్రామాలు జివిఎంసిలో విలీనమైన 17 ఏళ్లు అయినా నేటికీ కొత్త పైపులైన్లు వేయలేదు. దీనిపై జివిఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు.

అనకాపల్లి మండలంలోని కొప్పాక, సిరసపల్లి, కొత్తూరు నర్సింగరావుపేట గ్రామాలు 2007లో జీవీఎంసీలో విలీనమయ్యాయి. 2007లో విలీనం కాకముందు ఈ గ్రామాల్లో వేసిన మంచినీటి పథకాలు, పైప్ లైన్లు మాత్రమే నేటికీ ఉన్నాయి. ఈ 17 ఏళ్లలో కొత్తగా ఒక్క పైపులైన్ కూడా వేయలేదు. ఏదైనా పైప్ లైన్ వేసినప్పుడు ఒక పైపు లైఫ్ పది సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. కాని 10 సంవత్సరాలు దాటినా ఏ పైపులైనూ మార్చలేదు. 2007 జీవీఎంసీలో విలీనమైనప్పటి నుండి కొత్తూరు నర్సింగరావుపేట గ్రామంలో మంచినీటి కులాయి పైప్ లైన్లన్నీ, అవుట్ పుట్, ఇన్పుట్ పుట్ రెండు పైప్ లైన్లు మార్చలేదు. ఆ పాత పైపులైన్లలో ఎక్కడైనా లీకైపోతే వాటిని మాత్రమే అక్కడక్కడ మారుస్తున్నారు.

జీవీఎంసీలో కలిసినప్పటికీ ఇంకా తమ గ్రామంలో మురికి నీటిలోనే పైప్ లైన్లు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పైపులో నుంచి వచ్చే మురికి నీరే ఆయా గ్రామ ప్రజలు తాగుతున్నారు. దీనివలన లేనిపోని రోగాల బారిన ప్రజలు పడుతున్నారు. 20 లేదా 25 సంవత్సరాలుగా ఆ మురికి కాలవల్లోనే ఉండిపోవడం వలన పైప్ లైన్ లీక్ ద్వారా ఆ నీరు అందులో కలుషితమై అనారోగ్యాలకు కారణమవుతుంది. మంచినీటి కుళాయి నుండి వచ్చే నీరు తాగినట్లయితే ప్రజల ప్రాణాలకే నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మొక్కలు నాటుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు

పిహెచ్‌సిని సందర్శించిన కేంద్రం బృందం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ ప్రతినిధులు డాక్టర్ అరుణ్ కాదంబ్, డాక్టర్ మితిలేష్ సొంబర్ శుక్రవారం సందర్శించారు ఆసుపత్రిలో సదుపాయాలు, అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సి ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక వైద్యాధికారులు తిరుపతిరావు, యశోదలను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఫీల్డ్ సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బైపా అరుణ్ కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్ కుమార్ 73వ జన్మదిన వేడుకలు స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ పదుల సంఖ్యలో జడ్జీలను, నాణ్యమైన న్యాయవాదులుగాను తయారు చేసిన ఏకైక న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ అని తెలిపారు. అలాగే తన జూనియర్లను ఎంతోమందిని రాజకీయాల్లో పంపించారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల తరపున వారి సమస్యల పట్ల అలుపెరుగని పోరాటాలు చేసి ఎంతోమంది పేద వర్గాల వారికి అండగా నిలబడి విజయాలను సాధించారన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సతీష్, సుబ్బారావు అడ్వకేట్, పసి ఉద్దీన్, అయం మహమ్మద్, జిల్లా బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబెర్, సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ, మధు కుంచె పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సహకారంతో శుక్రవారం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ట్రైనర్ "నేను క్రియేటర్" చే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల, ఉపాధ్యాయుల పట్ల, సమాజం పట్ల వ్యవహరించాల్సిన తీరును విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఎలా బంగారుమయం చేసుకోవాలో, ఎటువంటి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలో తెలియజేశారు. విద్యార్థులు చదువు పట్ల, వ్యక్తిత్వ వికాసంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పలువురు విద్యార్థులు తమ జీవితంలో మంచి నడవడికని అలవర్చుకుని తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయామాధురి, అధ్యాపకులు ఎస్ఆర్ జమీర్, యు.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వలన సామాజిక న్యాయం వెంటనే జరగకపోయినా భావి తరాలకు మేలు జరుగుతుందని రిజర్వేషన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ గుడాల సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ ఈ విధానం ఓబీసీలకు కూడా వర్తింపజేయాలని కోరుతున్నామన్నారు. ఈ విధానం ఓబీసీలకు వర్తింపజేస్తే దేశంలోని 5 వేల ఓబీసీ కులాల వారికి మేలు జరుగుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని గుడాల సత్యనారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికలపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పాఠశాల కమిటీల ఎన్నికల ప్రక్రియపై అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణులతో అనకాపల్లి పట్టణం, రింగ్ రోడ్డులో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పైలా శ్రీనివాసరావు

మాజీ సిఎం జగన్‌ను కలిసిన పైలా

ప్రజాశక్తి-పరవాడ : తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వై.ఎస్.ఆర్.సి.పి అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా వైయస్ఆర్‌సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేతో క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జిల్లా నాయకుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత బొత్స సత్యనారాయణని వైయస్ జగన్ ఎంపిక చేశారని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వైయస్ జగన్ పలు సూచనలు చేశారని తెలిపారు.

నేటి నుండి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా 2023- 24 ఆర్థిక సంవత్సరానికి జరిగిన పనులపై సామాజిక తనిఖీలు ఆగస్టు 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్ఆర్పి డి రాజేందర రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అన్ని రకాల పనులకు సామాజిక తనిఖీలు డోర్ టు డోర్ వెళ్లి నిర్వహించాలని కోరారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో రామ్మోహన్ రావు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ పనులకు సంబంధించి 2023- 24 ఆర్థిక సంవత్సరం గాను మండలంలోని పలు రకాల పనులను 14 కోట్లతో నిర్వహించారని, ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని కోరారు. ఈ సమన్వయ సమావేశం 9 మంది జిల్లా రిసోర్స్ పర్సన్స్, విలేజి రిసోర్స్ పర్సన్స్, టెక్నికల్ అసిస్టెంట్, వీఆర్పీలు, గ్రామ కార్యదర్శులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి మహేష్, ఏపీవో శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరమేష్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి ఎస్పీ ఎం.దీపికను శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, సామాజిక నాయకులు నాగేశ్వరరావు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను కాపులుప్పాడ విద్యుత్ కేంద్రానికి తరలించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పలు పంచాయతీల్లో పేరుకుపోయిన చెత్తను కాపులుప్పాడ విద్యుత్ కేంద్రానికి తరలించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి అధికారులను ఆదేశించారు. స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా పంచాయితీ అధికారి శిరీషారాణి మండలంలోని బాటజంగాలపాలెం, సబ్బవరం గ్రామ పంచాయతీ ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను శుక్రవారం పరిశీలించారు. ఆకస్మిక తనిఖీలో షెడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యముగా సబ్బవరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ల పరిసరాలలో ఉన్న చెత్త విషయమై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సదరు చెత్తను కాపులుప్పాడలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుచున్న పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పిఆర్ వన్ యాప్ నందు అప్లోడ్ చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీలో దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి మహేష్, కార్యదర్శి మూర్తి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిపిఒ శిరీషారాణి

అనకాపల్లి- చోడవరం రోడ్డుకు మరమ్మతులు

రోడ్డుకు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపలి - చోడవరం రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం రోడ్ల భవనాల శాఖకు రహదారుల మరమ్మతులకు, మెయింటెనెన్స్ నిధులు కేటాయించక పోవడంతో అనకాపల్లి- చోడవరం రహదారి, అనకాపల్లి విశాఖపట్నం వెళ్లే రోడ్డు కానీ పూర్తిగా గోతులు పడ్డాయి. ఈ పరిస్థితుల్లో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధికారులతో మాట్లాడి రోడ్ల ప్యాచ్ వర్క్ చేయడానికి 30 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేయించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించిన మేరకు శుక్రవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు భరత్ కుమార్, బొడ్డపాటి రామ్ కుమార్, పీలా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ప్రోత్సాహకాలు కుదింపు సరికాదు

ప్రజాశక్తి- కె.కోటపాడు : విశాఖ డెయిరీ పాడి రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను క్రమంగా తగ్గిస్తుండడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడి రైతులకు ఇచ్చే బోనస్ గత సంవత్సరం నుండి నిలుపు చేయడమే కాకుండా పాల రైతులకు ఇచ్చే ఇన్సూరెన్స్ కూడా తగ్గించుకుంటూ వస్తుందని తెలిపారు. పాల సరఫరాతో సంబంధం లేకుండా 60 సంవత్సరాలు నిండిన పాడి రైతు చనిపోతే 30 వేల రూపాయలు ఆ కుటుంబానికి ఇచ్చేవారని, ప్రస్తుతం నిబంధనలు మార్చి ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ప్రతి పాడి రైతు సంవత్సరానికి 200 లీటర్ల పాలు పోయాలని నిబంధన పెట్టి ఆ రైతు మరణిస్తే వారసులకు కేవలం 3 వేల రూపాయలు మాత్రమే అందిస్తుందని తెలిపారు. అలాగే ఏడాదికి 500 లీటర్లు దాటిన వారు చనిపోతే 7,500 , 750 లీటర్లు దాటిన వారికి పదివేల రూపాయలు, వెయ్యి లీటర్లు దాటిన వారికి 15 వేల రూపాయలు ఆయా కుటుంబాలకు విశాఖ డెయిరీ ఇన్సూరెన్స్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ విధమైన నిబంధనలు పెట్టడం దుర్మార్గమన్నారు. విశాఖ డెయిరీ లాభాల్లో ఉన్నందున ఆ లాభాలను రాజకీయ అవసరాలకు ఉపయోగించకుండా ప్రతి పాడి రైతుల అభ్యున్నతికి వినియోగించాలని, పాడి రైతుకు ప్రోత్సాహకాలు తగ్గించే బదులు అదనంగా పెంచాలని డిమాండ్ చేశారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలపై ఆయా అధికారులతో సమీక్షించి సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అసంతృప్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై బి.కింతాడ, ఏ.కొత్తపల్లి, రైవాడ సర్పంచులు బూరె బాబురావు, చింతల వెంకటరమణ, చల్లా లక్ష్మితో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడారు. దీనిపై ఎమ్మెల్యే బండారు స్పందిస్తూ శాఖల వారీగా క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. నాడు నేడు, జలజీవన్ మిషన్ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండలంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాల పూర్తి వివరాలను అందించాలని ఈవో పిఆర్డి సంతోష్ నళినిని ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాలలో పనిచేసే క్లాత్ మిత్రులకు పూర్వ పద్ధతిలో జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపీపీ -2 గంగా భవాని, ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, చిత్రంలో ఎంపిపి, జెడ్పిటిసి

విద్యార్థులను అభినందిస్తున్న రూపావతి

గురుకుల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

ప్రజాశక్తి- సబ్బవరం

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏటిఎల్ మారథన్ 2023-24, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతిఆయోగ్ వారు నిర్వహించిన టాప్ 500 ప్రాజెక్ట్స్‌లో స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని గురుకుల పాఠశాలల అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల సమన్వయకర్త రూపావతి అన్నారు. సబ్బవరం గురుకులం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ టాప్ 100లోపు ప్రాజెక్టులలో నిలవడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జె.సందీప్, ఎల్.మున్నా, గైడ్ టీచర్ డాక్టర్ టి.రాంబాబు, ప్రిన్సిపాల్ యన్.రామక్రిష్ణలను ఆమె అభినందించారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం నగరాల్లో పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చేయడంతో పాటు స్మార్ట్ డ్రైనేజ్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఏటీఎల్ మారథన్ 2023-24 లో 20,000 వేల ప్రాజెక్ట్స్, 50,000 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు జానకిరామ్, చిరంజీవిరావు, ప్రభాకారారావు, తిరుపతిరావు, ఐసాక్‌లు అభినందించారు.

ప్రజల ఆశలు నెరవేర్చేలా పాలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా టిడిపి కూటమి పాలన సాగుతుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారు. అచ్చుతాపురంలో శుక్రవారం టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనకు విసుగు చెందిన సామాన్య ప్రజలు ఎన్నికలలో ఘోరంగా ఓడించారని తెలిపారు. జగన్ చేసిన పరిపాలన అసంతృప్తి తో ప్రజలు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఎన్నికలలో తనను గెలిపించిన టిడిపి బిజెపి జనసేన పార్టీల నాయకులకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ లాలం భవాని భాస్కర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మాజీ జడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగ్ రావు, జనసేన పార్టీ అచ్చుతాపురం మగపాక మండలాల అధ్యక్షులు బి రాందాస్, టెక్కలి పరశురాం, కూటమి నాయకులు రాజాన సన్యాసినాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, దూళి రంగనాయకులు, డిఎస్ఎన్ రాజు, లాలం చందు తదితరులు పాల్గొన్నారు.

8న మోడల్ స్కూల్ కమిటీ ఎన్నికలకు తల్లిదండ్రులు రావాలి

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజు పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకులు 8న పాఠశాలకు రావాలని పాఠశాల ప్రిన్సిపాల్ పీలా ఆశ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తామని, ఎంపికైన 15 మంది సభ్యులలో ఇద్దరిని చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నుకుంటారని తెలిపారు. ఓటర్ లిస్టులను ఈసరికే పాఠశాల నోటీసు బోర్డులోనూ, సచివాలయం వద్ద పెట్టడం జరిగిందని, అభ్యంతరాలు ఉంటే 5వ తేదీన పరిష్కరించి, తదుపరి ఆఖరి ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపల్ ఆశ తదితరులు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

పింగళికి నివాళులర్పిస్తున్న ఎఎంఎఎల్ కాలేజీ సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకయ్య సాధారణ కుటుంబంలో పుట్టి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, జాతీయ జెండాను 1921లో రూపొందించారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో శుక్రవారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను మహాత్మా గాంధీ ప్రశంసించారన్నారు. పింగళి వెంకయ్యను కీర్తిస్తూ, జాతీయజెండాకు జేజేలు పలుకుతూ చాత్రోపాధ్యాయులు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్ సుధాకర్, సిఏ సోమయాజులు, గొట్టేటి.రవి, ఎం మహాలక్ష్మి, మాధవి, హరిణి పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ పతాకం రూపకర్త, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు మాట్లాడారు.జాతీయ పతాకం రూపకల్పన లో పింగళి వెంకయ్య చేసిన కృషి ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

చారిత్రక ప్రాముఖ్యత కలిగిన యలమంచిలి రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లు నిలిపి ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డైలీ పాసింజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో సమస్యలు విన్నవించారు. కొండకర్ల ఆవ, పంచదార్ల పుణ్యక్షేత్రం, అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్‌లలో వేలాది మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ పనిచేస్తున్నారని, వారి రాకపోకలు యలమంచిలి రైల్వేస్టేషను ద్వారా జరుగుతోందని వివరించారు. స్థానికులు కూడా నిత్యం ఇతరప్రాంతాలనుండి రాకపోకలు సాగిస్తున్నారని వారికి రవాణా సౌకర్యం కల్పించే విధంగా మహబూబ్‌నగర్, రత్నాచల్, ప్రశాంతి రైళ్లకు ఇతర ఎంపీలతో కృషి చేసి యలమంచిలిలో హాల్టు ఏర్పాటు చేయాలని కోరారు. రామనగర్ గేటు దగ్గర అండర్ పాస్‌వే నిర్మించాలని కూడా అభ్యర్ధించారు. రైల్వే స్టేషన్‌లో కోచ్ డిస్‌ప్లే బోర్డులు, పార్సిల్ ఆఫీస్, ఆర్‌పిఎఫ్ చెక్‌పోస్టు, ఎస్కలేటర్స్, లిఫ్ట్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎవి.రమణ, సెక్రటరీ జయంత్, సీతారామరాజు, రాజేశ్వరరావు, పార్టీ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కొఠారు నరేష్, లవుడు లోవరాజు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణ సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చాలా బాధేస్తుందని డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు అన్నారు. సుప్రీంకోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ఎస్సీ ఎస్టీ వ్యక్తిగతలపై అధ్యయనం చేసి అనంతరం ఈ నిర్ణయం తీసుకొని ఉంటే బాగుండేదన్నారు. ఇప్పుడు రాష్ట్రాలకు వర్గీకరణ నిర్ణయాధికారం ఇవ్వడం వలన దళితులు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతాయన్నారు. వారిని రాజకీయంగా వాడుకుంటారు తప్ప ఈ వర్గీకరణ దేనికి ఉపయోగపడదన్నారు. అసలు దళితులపై జరుగుతున్న అన్యాయాలపై ఏ ఒక్క కోర్టులో న్యాయవ్యవస్థలో ప్రభుత్వాలు కమిటీలు ఎక్కడ వెయ్యలేదని పేర్కొన్నారు.

రైవాడ జలాశయం నుండి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రైవాడ జలాశయం నుంచి సాగునీటి అవసరాల కోసం కుడి, ఎడమ కాలువల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని స్థానిక రైవాడ జలాశయం అధికారులు సమక్షంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గతంలో రైతులతో మాట్లాడి ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని దిగువ ఆయికట్టుకు విడుదల చేశారు జలాశయ నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108,60, మీటర్లు ఉందని జలాశయం డిఈ సత్యంనాయుడు, తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, రెండు పార్టీల నాయకులు సిహెచ్ సూర్యనారాయణ, పోతల పాత్రనాయుడు, రెడ్డి బలరాం, కోమార బాబురావు, పోతల నాయుడు బాబు, పూడి నారాయణమూర్తి, లెక్కల అవతారం, కాళ్ళ ప్రసాద్, ఎం శ్రీనివాసరావు, ఏఈలు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలోని గవరపాలెం దుర్గ నాయుడు వీధి పరిసర ప్రాంతాలలో లోఓల్టేజ్ సమస్యపై శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణకు స్థానికులు ఫిర్యాదు చేశారు. చాలా రోజులుగా ప్రజలు పడుతున్న ఈ ఇబ్బందులపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. పిల్లలు వృద్దులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే స్థానిక అధికారులకు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే రామకృష్ణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బుద్ద శ్రీనివాసరావు, భీశెట్టి సుధా తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులకు వెళ్లి పింఛన్లు అందజేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని కందిపూడి, కోవులపల్లి గ్రామాలకు చెందిన పలువురు పింఛనుదారుల అనారోగ్యంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్నారు. సచివాలయ సిబ్బంది శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందిని గ్రామ పెద్దలు అభినందించారు.

వడ్డాది : బుచ్చియ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామానికి చెందిన ఆలమంద రాజులమ్మ కేజీహెచ్‌లోనూ, బండారు అఖిల ఏబిసి ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు. వారికి సామాజిక పింఛన్లు గత మూడు నెలల నుండి సచివాలయ పశు సమర్థత సహాయకులు పండూరి భానుజీరావు తన సొంత ఖర్చులతో వైజాగ్ వెళ్లి వారికి పెన్షన్ అందిస్తున్నారు. భానుజీని పేషెంట్ కుటుంబ సభ్యులు, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు అభినందించారు.

అనకాపల్లి ఎన్టిఆర్ ఆసుపత్రికి వచ్చి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కామునిగెడ్డ మినీ జలాశయం పూడికలను

రైతులు సొంతఖర్చులతో తొలగింపు

ప్రజాశక్తి కొత్తకోట:రావికమతం మండలం ధర్మవరం గ్రామ సమీపంలో కామునిగెడ్డ మినీ జలాశయంలో పూడికలను రైతులు స్వచ్ఛందంగా కలిసి పూడికలు తీయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులంతా కలిసి జెసిబితో ఈ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు అనపర్తి అప్పారావు, పల్లా సింహాద్రి, గుతేం అప్పారావు, నీలాపు నూకరాజు, తదితరులు మాట్లాడుతూ, జలాశయం కాలువల పూడికపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులకు పలుమార్లు చెప్పినా స్పందన లేదన్నారు. సుమారు 200 పైగా కుటుంబాలకు జీవనాధారమైన జలాశయాన్ని పట్టించుకోక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా తమ సొంత నిధులు ఏర్పాటు చేసుకొని సమస్యను పరిష్కరించు కుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలవల పున:నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు..

పట్టించుకోని పాలకులు

పూడికను తీయిస్తున్న రైతులు

సుమారు 700 ఎకరాలకు ఆయు కట్టు భూములకు సాగు నీరు అందించే ఈ మినీ జలాశయాన్ని గత పదేళ్లగా పాలకులు పట్టించు కోక పోవడంతో ఆయకట్టుకు నీరు అందించే కుడి, ఎడమ కాలువలు శిథిలావస్థకు చేరాయి. ఈ మినీ జలాశయం కింద కొత్త ధర్మవరం, పాత ధర్మవరం, సికయపాడు, కొత్తకోట, జెడ్.కొత్తపట్నం గంప వానిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 పైగా గిరిజన, దళిత, బిసి వర్గాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. 1986లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రభుత్వంలో సుమారు మూడు కోట్లకు పైగా నిధులు వెచ్చించి మినీ జలాశయాన్ని నిర్మించారు. గత 15 ఏళ్ళు కిందట జలాశయానికి కుడి భాగంలో కాలువ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టారు. దీంతో ఆయు కట్టు భూములకు పుష్కలంగా సాగు నీరు అందేది.. తరవాత కాలంలో అప్పటి నుంచి కాలవలో పూడిక తీత పనులు చేయక పోవడంతో కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందలేదు. గత ఏడాది ఆయకట్టు రైతులు సొంతగా నిధులు ఏర్పాటు చేసుకొని పూడికతీత పనులు చేపట్టారు. సాగునీరు పారేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ పైపులు శిథిలమై పూర్తిగా కూరుకుపోయింది. సుమారు 30 అడుగుల లోతులో సిమెంట్ పైపులు కూరుకు పోవడంతో ఈ ఏడాది ఆయకట్టు భూములకు సాగు నీరు అందే అవకాశం కోల్పోయారు.

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం గుడివాడ గురు నాధరావు జలాశయం (కల్యాణపులోవ) నుంచి రెండు గేట్లు ఎత్తి 75 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణదొర శుక్రవారం తెలిపారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 460.00 అడుగులు కాగా ప్రస్తుత శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 459.20 అడుగులకు చేరిందన్నారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో 50క్యూసెక్కుల వరద నీరు చేరడంతో రెండు గేట్ల ద్వారా 75 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి వదులు తున్నట్లు ఏఈ తెలిపారు. ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్లు ద్వారా దిగువకు నీరు వదలడం జరుగుతుందన్నారు. సర్పా నది పరివాహక ప్రాంతంలో వున్న రైతులు, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం నుంచి కృష్ణదేవిపేట వెళ్లే రహదారిలో లింగంపేట, గుజ్జుమానుపాకలు దగ్గర రోడ్డు శిథిలమై వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు వాహనదారుల దృష్ట్యా మాజీ జెడ్పిటిసి తారక వేణుగోపాల్ స్వయంగా శుక్రవారం దగ్గరుండి గోతులను పూడిపించారు. ఈ పనులను దగ్గరుండి చేయించారు.

పరిశీలిస్తున్న అధికారులు

నాగబాబుతో రాయపురెడ్డి కృష్ణ భేటీ

ప్రజాశక్తి-మాడుగుల: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబుతో మాడుగుల నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ భేటీ అయ్యారు. శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నాగబాబుతో భేటీ అయి పలు అంశాలపై చర్చించినట్లు కృష్ణ తెలిపారు. గడచిన ఎన్నికల్లో నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి కష్టపడిన కార్యకర్తలు వివరాలను ఆయనకి లిఖితపూర్వకంగా అందించినట్లు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్ నేతల సంబరాలు

ప్రజాశక్తి-వీడికాడ: వర్గీకరణకు సుప్రీంతీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మండలం కేంద్రంలో మహజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులు రావాడ దేవుడు బాబు ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు, మాది ఉద్యోగుల సంఘం చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ కండెల్లి వెంకటరావు మాస్టారు, రెల్లిహక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ఎర్రంశెట్టి వరప్రసాద్, ఎంపీటీసీ రావాడ మని, ఎమ్మార్పీఎస్ నాయకుడు రావాడ రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమం లో మహజన సోషలిస్టు పార్టీ నాయకులు మారడ బూడి నాగరాజు, కంటిపాము ఈశ్వరరావు, పెద్ద సంతోష్, చిన్న సంతోష్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను అభినందిస్తున్న సభ్యులు

స్పీకర్‌ను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సీపట్నంలో గంజాయి కోర్టు ఏర్పాటు చేయాలని, జిల్లాస్థాయిలో ఒక బెంచ్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు విస్తరింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెట్ట ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, సీనియర్ న్యాయ వాదులు పోక్కునూరు నరసింహం, కామిరెడ్డి అప్పలనాయుడు, రుత్తల అప్పారావు, కామిరెడ్డి సత్యనారాయణ, అనిమిరెడ్డి గోవిందరావు, లోకా లోవరాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులతో బొత్స సమావేశం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో వైసిపి కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి, ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ప్రజా ప్రతినిధులతో పరిచయ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులతో పార్టీ కార్యాలయం వద్ద బొత్స మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు ,పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

వడ్డాదిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నాతవరం:మండల కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల రాలీని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు వి.విజయలక్ష్మి, ఏ.నాగజ్యోతి తల్లి పాల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.నూకరత్నం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి :తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నక్కపల్లి వీవర్స్ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ దుర్గారాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సూపర్వైజరులు సౌజన్య, తులసి, కనకదుర్గ పాల్గొన్నారు.

అనకాపల్లి:ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు అనకాపల్లి పట్టణం విజయరామరాజుపేట అంగన్వాడీ సెంటర్-1, మండలంలోని వెంకుపాలెం సచివాలయంలోనూ ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను సూపర్వైజర్ డి లక్ష్మి వివరించారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు నాగలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, ఝాన్సీ, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్.సాయిరాం, వైద్య సిబ్బంది చైతన్య, విజయ కుమారి, ఎల్‌టి.అన్నపూర్ణేశ్వరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక, చూచుకొండ పీహెచ్సీల వైద్యాధికారులు డాక్టర్ విమలగిరి, ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో చూచుకొండ, తోటాడ, వాడ్రాపల్లి గ్రామాలలో శుక్రవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

కశింకోట : మండలంలోని బయ్యవరంలో ఐసిడిఎస్ బయ్యవరం సెక్టార్ సూపర్‌వైజర్ వంశీ ప్రియా ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్వరూప, కార్యకర్తలు పార్వతి, పరమేశ్వరి, రజిని, రమణమ్మ, పాల్గొన్నారు.

అచ్యుతాపురం:మండలంలోని చౌడపల్లి, చీమలాపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు సిహెచ్ వేణుగోపాల్, డాక్టర్ వసంత కుమార్, అంగన్వాడీ టీచర్ జయలక్ష్మి, మహిళా పోలీస్ అనుపమ, వైద్య సిబ్బంది హెచ్‌వి భవాని, సూరిశెట్టి శ్రీనివాస్ సునీత, గాయత్రి, దేవుడమ్మ, గణపతి, శిరీష పాల్గొన్నారు.

కె.కోటపాడు:మండలంలోని చౌడువాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-4లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ జయలక్ష్మి, అంగన్వాడీలు ఈశ్వరమ్మ, మంగవేణి, సత్య, పరదేశమ్మ, సుబ్బలక్ష్మి, వెంకటలక్ష్మి, అప్పలనరస, జగది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం, బుచ్చయ్యపేట గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారి సంధ్యారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది సెక్టర్ పరిధిలోని లోపూడి-2, బంగారమెట్ట, కోమలపూడి, పడ్డాది-1, విజయరామరాజుపేట అంగన్వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీల లబ్దిదారులతో కలిసి ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, వైద్య సిబ్బంది ప్రభావతి, సాయిలక్ష్మి, హెచ్‌వి అమ్మాజీ, అంగన్వాడీలు కడియం జ్యోతి, కుసుమ, అమ్మాజీ, ధనలక్ష్మి, వరహాలమ్మ, మహిళా పోలీసులు కామాక్షి, భార్గవి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట మండలం మంగళాపురంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి తల్లిపాలతో బిడ్డలకు కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధాలక్ష్మి, ఎఎన్ఎం రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రేవతి, మహిళా పోలీస్ మహాలక్ష్మి, ఆయాలు దేవి, అరుణ, ఆశాలు చిన్నమ్ములు, విజయలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్టమని స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్ కె ప్రమీల అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఎగువపేట, అప్పికొండ వీధి అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖపట్నం : పెద జాలరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చైతన్య, పీడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గేష్మాంజలి, అర్బన్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఎంవివి.మురళీమోహన్ వివరించారు.

మంగళాపురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

వంతెనను పరిశీలించిన ఎస్ఇ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పందూరు గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణాన్ని శుక్రవారం పంచాయతీరాజ్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీంద్ర పరిశీలించారు. గతంలో 6కోట్ల రూపాయలతో నిర్మించి అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఈ మేరకు జిల్లా స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ఐదు కోట్లతో అంచనాల రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పరిశీలించేందుకు వచ్చిన రవీంద్ర మాట్లా డుతూ, నిధుల మంజూరుకు ప్రతిపాదనల పంపామన్నారు. ఇప్పటికే వంతెనకు సంబంధించి 8 భాగాలకు గాను ఒక భాగం స్లాబ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ స్లాబ్‌లతో పాటు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ కుమార్ రాజు, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లురాజు, మాజీ సర్పంచ్ నారాయణరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

భూ సమస్యపై రైతుల నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:తమ భూసమస్యలను పరిష్కరించాలని మండలంలోని పాతకృష్ణదేవిపేటకు చెందిన రైతులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా రైతులు విప్పల సాంబమూర్తి, కొమ్మిన పైడిరాజు, కె.అప్పలనాయుడు, ఎస్.తలుపులు, రమణ మాట్లాడుతూ, 1994లో గ్రామంకు చెందిన 30 మంది పేదలకు ల్యాండ్ సీలింగ్ కింద భూములు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. చింతల అచ్చియ్యనాయుడు భూమిని ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ కింది తీసుకుందని, కానీ అప్పటికే ఆ భూమిలో కొన్ని సంవత్సరాలుగా కొంగశింగి, ఎఎల్‌పురంకు చెందిన ఏడుగురు రైతులు కౌలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ భూమి అని పరిగణనలోకి తీసుకోవడంతో అప్పటికే సాగులో ఉన్న రైతులు హైకోర్టు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకోవడం జరిగిందన్నారు. దీనిని అనుసరించి అప్పట్లో నర్సీపట్నం రెవిన్యూ డివిజన్ అధికారి 145 నోటీసు విడుదల చేశారని, సదరు సాగులో ఉన్న రైతులే అర్హతలు నిర్ధారించారన్నారు. ఇప్పుడు మరలా కొంతమంది ఆ భూములు తమవి అని తగాదాలకు దిగడంతో తహశీల్దార్‌కి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పరిశీలిస్తున్న అప్పలరాజు

రైతులకు సాగు నీటిని అందించాలి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని రైతులకు సాగునీటిని అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం రైతులతో కలిసి పి.ధర్మవరం, ఏటికొప్పాక, పద్మనాభరాజు పేట రెవెన్యూలో ఉన్న మిరాసీ కాలువను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ మిరాసి కాలువ ద్వారా నీరు వస్తేనే పి.ధర్మవరం, పద్మనాభ రాజుపేట, పులపర్తి, గూండ్రుబిల్లిలో వరి నాట్లు వేయడం జరుగుతుందన్నారు. ఈ కాలువ పూడిక పోయి, తుప్పలు, డొంకలతో నిండిపోవడంతో నీరు పారడానికి అవకాశం లేకుండా ఉందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ పూడిక తీయించి, రైతులకు నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎం.రాజేష్, ఎస్.గోవిందరావు, కె.రమణ, కె.బాబూరావు, ఎ.లోవరాజు, ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ సర్వీస్ వాహనాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీ హుండాయ్ ప్రతినిధులు

లక్ష్మీ హుండాయ్ మొబైల్ సర్వీసింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ లక్ష్మీ హుండాయ్ విశాఖపట్నం శాఖ తమ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించే క్రమంలో మొబైల్ సర్వీసింగ్ వ్యాన్‌ను శుక్రవారం ఉదయం సంస్థ మొబైల్ సర్వీస్ జోనల్ హెడ్ షహీబ్ దేశాయ్, రీజనల్ సర్వీస్ హెడ్ స్వప్నిల్ చౌదరి, టెరిటరీ సర్వీస్ మేనేజర్ జునాయిడ్ అక్రమ్ ప్రారంభించారు. ఈ మొబైల్ సర్వీస్ అవకాశం రూరల్, అర్బన్ ప్రాంతాల కస్టమర్లకు వారి ఇంటి వద్దనే సర్వీస్ అందిస్తుందని వారు తెలిపారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 8096666487 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ హుండాయ్ సీఈవో లు డాక్టర్ వి.శ్రీనివాస్, రఘు, సర్వీస్ ఏజీఎం ఎమ్‌డి ప్రసాద్, అకౌంట్స్ జనరల్ మేనేజర్ జి. కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

సమిష్టి నిర్ణయాలు తీసుకోవాలి

ఎంఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల:విద్యాశాఖ అధికారులు తీసుకునే విధానపరమైన నిర్ణయాలు అన్ని సంఘాల వారిని కలుపుకొని తీసుకోవాలని యుటిఎఫ్ మండల శాఖ కోరింది. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి రామారావును వినతి పత్రం అందజేశారు. విద్యాశాఖ కార్యాలయంలో తీసుకునే నిర్ణయాలు కొన్ని సంఘాల వారిని కలుపుకుని ఒక నిర్ణయానికి రావాలన్నారు., పాఠశాల నిర్వహణ సమయంలో ఉపాధ్యాయులను కార్యాలయ పనులకు ఉపయోగించ రాదని, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింగరావు, కార్యదర్శి ప్రసాద్, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, లోవరాజు, చిట్టియ అప్పలరాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సమిష్టి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సీపీ అధ్యక్షతన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో మాదకద్రవ్యాలను, గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా, పోలీస్ యంత్రాంగం అనేక చర్యలు చేపట్టిందన్నారు. 100 రోజుల్లో మాదకద్రవ్యాలను, గంజాయిని పారద్రోలేందుకు ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. గంజాయి రవాణా చేసే మార్గాల్లో చెక్ పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించి, సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. స్నిఫర్ డాగ్స్ ద్వారా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండులు, బ్యాగేజీ లాకర్లు, పార్శిల్ ఆఫీసులు, అనుమానిత వాహనాలు, షాపుల్లో గంజాయిని, మాదకద్రవ్యాలను గుర్తిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మత్తుకు బానిసై నిరాశ, నిస్పృహలకు లోనైన వారికోసం మార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, డీ - ఎడిక్షన్, రీహేబీలీటేషన్ సెంటర్ల ద్వారా మత్తు నుంచి విముక్తులని చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో యువతకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు తీసుకునే ప్రాంతాలను గుర్తించి, చీకటి ప్రదేశాల్లో లైట్లను అమర్చడం, సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, కస్టమ్స్, పోర్ట్, నార్కోటిక్, డ్రగ్స్, మత్స్య శాఖ అధికారులు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.జగదీశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి.రమణ, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

రైతులకు అవగాహన కల్పిస్తున్న మోహన్ రావు

ప్రజాశక్తి-నక్కపల్లి:రైతులు వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఉద్దండపురంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు మాట్లాడారు. వరి నారు మడి నుండి పంట కోత వరకు పాటించాల్సిన మెలుకువలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు క్షుణంగా అవగాహన కల్పించారు.విత్తన శుద్ధి, కలుపు యాజమాన్యం, సమగ్ర చీడ పిడల యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యం , సస్య రక్షణపై వివరించారు. నారు ఉడిచే ముందు కొనలు తుంచుకుని నాటుకోవాలని, దీంతో ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఉధృతి తగ్గించవచ్చునన్నారు.

జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ మాట్లాడుతూ, పొలం బడి, రైతు ఉత్పత్తి దారుల తో అనుసంధానం ద్వారా మేలైన ధరలు కలిపించడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమామహేశ్వరరావు, సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, విఎఏ రాకేష్ పాల్గొన్నారు.

కొత్తకోట:రైతులు యాజమాన్య పద్ధతులతో పాటు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఇచ్చిన సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయధికారిణి రూప తెలిపారు. రావికమతం మండలం గుడివాడ లో రైతు సేవా కేంద్రం పరిధిలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలంలో వేసిన వరి నాట్లు పరిశీలించా రు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు...

కారిడార్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూములను శుక్రవారం నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, ఏపీఐఐసీ జెడ్‌ఎంలు శ్రీను, పద్మజా దేవి, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. వేంపాడు, అమలాపురం ప్రాంతాల్లో పరిశీలించి ఆర్ అండ్ ఆర్ కోసం స్థల పరిశీలన చేశారు. సాగు భూములకు, డి పట్టా భూములకు చెల్లించాల్సిన పరిహారం, ఇతర భూ సమస్యలను నిర్వాసితులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ సత్యనారాయణ, ఆర్ ఐ కన్నబాబు, సర్వేయర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు,

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీలో పారిశుద్య పనులు ముమ్మరంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఆదేశించారు. శుక్రవారం శానిటరీ విభాగంలోని శానిటరీ సెక్రటరీలతో సమావేశమై మాట్లాడారు. మున్సిపాలిటీలోని అన్ని సచివాలయ పరిధిలో ఉన్న కాలువలు, జంక్షన్ వద్ద ఉన్న పాయింట్లు శుభ్రం చేయించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు నిషేదం కోసం కృషి చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో వేడి నీటిని అందించాలని హోటళ్లు, టీ షాపు యాజమానులకు సూచించాలని చెప్పారు.

పారదర్శకంగా విద్యాకమిటీ ఎన్నికలను నిర్వహించాలి

డిప్యూటీ డిఇఒ అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈనెల 8వ తేదీన నిర్వహించే పేరెంట్స్ కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని డిప్యూటీ డిఇఓ పెన్నాడ అప్పారావు సూచించారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్ కమిటీ ఎన్నికల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీలలో ప్రధానపాత్రధారులు విద్యార్థుల తల్లిదండ్రులేనని, ఒక్కో తరగతి నుండి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకోవలసి ఉంటుందని, వీరిలో సామాజిక ప్రతికూల పరిస్థితి లను ఎదుర్కొంటున్న వర్గాలనుండి ఒకరు, బలహీన వర్గాలకు చెందిన వారినుంచి ఒకరు, జనరల్ కేటగిరీ నుండి ఒకరు ఉండాలన్నారు. ఈ ముగ్గురులో ఇద్దరు కనీసం మహిళలు ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు కనీసం 50శాతం మంది తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు ఉండాలని, నోటిమాటతో, చేతులను ఎత్తడంతో, రహస్య బ్యాలెట్ విధానం ద్వారా గాని ఎన్నికలను జరిపించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై విధి విధానాలపై వివరించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ నరేష్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఓ అప్పారావు

వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న కృష్ణమూర్తి

వెంకటేశ్వరరావుకు కృష్ణమూర్తి పరామర్శ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నేవల్ డాక్ యార్డు మాజీ ఉద్యోగి జ్యేష్ఠ వెంకటేశ్వరరావును సాగర్‌నగర్‌లోని అతని నివాసంలో సిపిఎం విజయనగరం జిల్లా నాయకులు ఎం.కృష్ణమూర్తి శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవలే వెంకటేశ్వరరావు కుమారుడు రణధీర్ అనారోగ్యంతో మృతిచెందడం, వెంకటేశ్వరరావు కూడా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన కుటుంబ సభ్యులను కృష్ణమూర్తి (మాజీ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి సిపిఎం నాయకులు) సహా మరో మాజీ ఉద్యోగి కృష్ణమూర్తి నాయుడు పరామర్శించారు. కుటుంబానికి ధైర్యాన్నిచ్చారు.

రవికృష్ణరాజును సత్కరిస్తున్న జివిఎంసి కమిషనర్

రవికృష్ణరాజు స్ఫూర్తిదాయకం

-జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన ఇంజినీరుగా నగరానికి అనేక సేవలందించి, అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేసిన పి.రవికృష్ణరాజు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పి.రవికృష్ణరాజును జివిఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సన్మానసభను ఏర్పాటుచేశారు. ఈ సభలో కమిషనర్ మాట్లాడుతూ, జివిఎంసిలో ప్రధాన ఇంజినీర్‌గా మూడేళ్లు విధులు నిర్వహించి ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టి, తన విభాగంలో వారందరికీ స్ఫూర్తిదాయకమైన సలహాలను, సూచనలను అందించారన్నారు. మిలాన్, గిరి ప్రదక్షిణ, చందనోత్సవం, తదితర ఎన్నో ప్రత్యేకమైన కార్యక్రమాలను నగరంలో విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు. ఏ అధికారైనా ప్రజలతో, అధికారులతో, ప్రజాప్రతినిధులతో, మేధావులతో విధులు విషయంలో చర్చిస్తే చాలా సమస్యలకు వెంటనే పరిష్కార మార్గం దొరుకుతుందని, అందుకు రవికృష్ణరాజు మార్గదర్శకాలను ఉదాహరణగా తీసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. అనంతరం రవికృష్ణరాజును పూలమాల, దుశ్శాలువతో కమిషనర్ సత్కరించి జ్ఞాపికను బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టే ఇచ్చినా ఇల్లు కూల్చాలని చూస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ 26వ వార్డులో చిటికెల కరుణాకర్ అనే వ్యక్తికి చెందిన ఇంటిని మున్సిపల్ అధికారులు అన్యాయంగా కూల్చివేసేందుకు ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 1977లో లాలం రాధాకృష్ణ నుంచి కొనుగోలు చేశారన్నారు. దానికి సంబంధించి ఇంటి ఆస్తి పన్ను, కరెంట్ బిల్లు చెల్లింపులు చేస్తున్నారన్నారు. ఇన్ని ఉన్నప్పటికీ మరొక నోటీసులు ఇవ్వడం భావ్యం కాదన్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులపై న్యాయస్థానం నుంచి స్టే ఆర్డర్ వచ్చిందన్నారు. అయినప్పటికీ ఈ విధంగా దౌర్జన్యం చేయడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహామూర్తి, టౌన్ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.